ఈనాడు
THE HEART AND SOUL OF ANDHRA PRADESH
Thursday, September, 10, 2009.



# విధాన సేద్యం... ప్రధాన సూత్రం

పి. వి. సుబ్బయ్యచౌదరి



## సర్కారు సాయమే రైతుకు రక్ష

వర్షాభావం ఈ ఏడాది దేశవ్యాప్తంగా అసాధారణ పరిస్థితులను సృష్టించింది. దిగుబడులు తగ్గే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తుండటంతో దేశంలో ఆహారభద్రత ప్రమాదంలో పడింది. కమ్ముకొన్న కరవు రైతులను దిక్కుతోచని స్థితి లోకి నెట్టేస్తోంది. సాధారణ పరిస్థితుల్లో దేశంలో సాగయ్యే మొత్తం భూమి 192.80మిలియన్ హెక్టార్లు. సాగునీరు అందుబాటులో ఉన్న వ్యవసాయ భూమి 82.63 మిలియన్ హెక్టార్లు. మొత్తంగా వర్షాధార సేద్య భూమి 57శాతంకాగా, సాగునీటి సౌకర్యాలు అందుబాటులో ఉన్న వ్యవసాయభూమి 43శాతం. దేశవ్యాప్తంగా 2007-2008లో ధాన్యం దిగుబడి 230.67 మిలియన్ టన్నులు. ఇందులో ఖరీఫ్ వాటా 120.97 మిలియన్ టన్నులు కాగా, రబీ వాటా 109.70 మిలియన్ టన్నులు. అంటే మొత్తం దిగుబడుల్లో ఖరీఫ్ వాటా 52శాతమన్నమాట. సమయానికి వానలు పడటం నిరుడు ఖరీఫ్‌లో ఉత్పత్తి పెరగడానికి కారణం. ఖరీఫ్‌లో చక్కటి వర్షాలు పడితే రబీపై సానుకూల ప్రభావం పడుతుంది. కానీ,

ఈ ఏడాది పరిస్థితులు భిన్నంగా కనిపిస్తున్నాయి. ఖరీఫ్‌లో వర్షాలు మొహం చాటేయడం రబీపైనా ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ప్రస్తుతం దేశ వ్యవసాయం దుర్భిక్షం కోరల్లో కొట్టుమిట్టాడుతోంది. ఈ పరిస్థితుల్లో రైతులకు చేయూతనిచ్చేందుకు రూపొందించాల్సిన సహాయ కార్యక్రమాలపై; విత్తనాల లభ్యతను పెంచి, పశుసంతతికి నీటిని, మేతను అందజేయడం తదితరాలపై సర్కారు తక్షణం దృష్టిసారించాలి.

## ప్రత్యామ్నాయ మార్గాలు

దేశంలో జూన్1నుంచి ఆగస్టు12 మధ్యవరకూ మొత్తం వర్షపాతం 401మిల్లీమీటర్లు. సాధారణ పరిస్థితుల్లో పడాల్సిన వర్షం 566మిల్లీమీటర్లు. అంటే ఈ ఖరీఫ్ వర్షంలో పాతికశాతం కోతపడిందన్నమాట. సాధారణ వర్షపాతంతో పోలిస్తే- ఈదఫా వాయవ్యభారతంలో 40శాతం, మధ్యభారతంలో 20శాతం, దక్షిణభారతాన 14శాతం, ఈశాన్యంలో పాతికశాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది ఆగస్టు 28నాటికి ఖరీఫ్‌కింద దేశవ్యాప్తంగా సాగుచేసిన మొత్తం భూమి 86.76మిలియన్ హెక్టార్లు. నిరుటి సాగువిస్తీర్ణంతో పోలిస్తే ఈ ఖరీఫ్‌లో 7.68మిలియన్ హెక్టార్ల(ఎనిమిది శాతం)కు కోతపడింది. వర్షాభావంవల్ల దేశ వ్యవసాయంపై పడిన ప్రతికూల ప్రభావం అంతా ఇంతా కాదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవచ్చు అన్నదానిపై సర్కారు రైతులకు సలహాలిచ్చింది. విత్తనాల సమస్య, బీమా సౌకర్యాన్ని వర్తింపజేయకపోవడం వంటి కారణాలవల్ల ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులు పెద్దగా ఆసక్తి కనబరచడం లేదు. ఆలస్యంగా కురిసిన వర్షాలు ఖరీఫ్ రైతుకు పెద్ద మేలు చేయడం లేదనే చెప్పాలి. వీటివల్ల ఖరీఫ్ కింద సాగుభూమి విస్తీర్ణం పెరగడంగానీ, ఆహార ధాన్యాల దిగుబడులు గణనీయంగా వృద్ధి చెందే అవకాశాలుగానీ కనిపించడం లేదు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో సంక్షోభ నివారణ పథకాలను ప్రవేశపెట్టి కరవు పీడిత ప్రాంత రైతులకు సాంత్వన ఇవ్వాల్సిన గురుతర బాధ్యత సర్కారుది.

వర్షాభావం కొనసాగితే కరవు పోటెత్తుతుంది. ఏ తరహా వాతావరణ పరిస్థితుల్లోనైనా కరవు కోరలు సాచే అవకాశాలున్నాయి. మెట్టప్రాంతాల్లో దుర్భిక్షం అత్యంత సహజం. అర్ధశుష్క(సెమి అరిడ్) వాతావరణ పరిస్థితుల్లోనూ కరవు సాధారణం. గాలిలో తేమ అధికంగాగానీ, మధ్యస్థాయిలోగానీ ఉన్న ప్రాంతాల్లో కరవు అత్యంత అరుదుగా తప్పరాదు. కరవు... దేశ నవనాడులనూ కుంగదీస్తుంది. భిన్న భౌగోళిక వైవిధ్యతలున్న భారత్‌వంటి దేశంలో కరవును సంపూర్ణంగా నిర్మూలించడం అసాధ్యం. కరవువల్ల భారతీయ సమాజంమీద పడుతున్న దుష్పరిణామాల తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నించవచ్చు. దేశంలో సుమారు సగం ప్రాంతం (246జిల్లాలు) దుర్భిక్షం బారిన పడిన ప్రస్తుత పరిస్థితుల్లో గతంతో పోలిస్తే ఈ ఏడాది వరి ఉత్పత్తి 10మిలియన్ టన్నులు తగ్గే అవకాశం ఉందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శరద్ పవార్ ఇటీవల వ్యాఖ్యానించారు. అదే నిజమైతే- యుద్ధ ప్రాతిపదికన సర్కారీ విభాగాలన్నీ సన్నద్ధం కావాల్సిన తరుణమిది. సంక్షోభ నివారణ చర్యలను వేగిరపరచి కరవు పీడిత ప్రాంత రైతులకు అండగా నిలవడం నేడు ప్రభుత్వం ముందున్న ప్రథమ కర్తవ్యం.

స్వాతంత్ర్యానంతర భారతంలో ప్రభుత్వాలు కరవును ఎదుర్కొనే విభిన్న విధానాలతో ముందుకొచ్చాయి. వాతావరణ పరిస్థితులను మదింపువేసి ముందు జాగ్రత్తలు తీసుకోవడం, కరవు నివారణ దిశగా దీర్ఘకాలిక చర్యలు చేపట్టేందుకు శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించుకోవడం వంటి విధానాలు రంగప్రవేశం చేశాయి. గ్రామీణ భారతాన్ని దుర్భిక్షం బారినుంచి కాపాడే లక్ష్యంతో వివిధ పథకాలనూ రూపుదిద్దారు. కరవు పీడిత ప్రజానీకానికి అండగా

నిలిచేందుకు డి.పి.ఎ.పి., డి.డి.పి., ఎ.ఆర్.ఈ.ఎస్.పి., పి.ఎం.జి.వై., ఎఫ్.డబ్ల్యు.పి., ఎన్.డబ్ల్యు.డి.పి., ఆర్.ఇ.జి.పి., ఐ.డబ్ల్యు.డి.పి., ఎస్.జి.ఆర్.వై., ఎస్.జి.ఎస్.వై. వంటి పథకాలను కేంద్ర, రాష్ట్రసర్కార్లు కొలువుదీర్చాయి. రైతులకు అవసరమైన ఆర్థిక మద్దతునిచ్చేందుకు గ్రామీణ బ్యాంకులను, సహకార రుణ సంస్థలను ఏర్పాటు చేశారు. కరవు విరుచు కుపడితే తొలుత దెబ్బతినేది దేశంలోని పల్లెలు. దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రాంతీయ అవసరాలకు అనుగు ణంగా భిన్నవ్యూహాలను, ప్రణాళికలను సిద్ధం చేసుకోవడం ప్రస్తుత నేపథ్యంలో అత్యావశ్యకం. కరవు నివారణ విధానాల వికేంద్రీకరణవల్ల బాధిత ప్రజలకు సత్వర సాంత్వన చేకూరే అవకాశాలు మెరుగుపడతాయి. అనేక సందర్భాల్లో స్వాతం త్ర్యానంతర భారతాన్ని దుర్భిక్షం నిలువెల్లా వణికించింది. మరీముఖ్యంగా 1972, 1987, 2002ల్లో సంభవించిన దారుణ దుర్భిక్షాలు దేశ స్మృతి పథాన్ని ఇప్పటికీ వీడిపోలేదు. దశాబ్దాలుగా కరవు చెండుకుతింటున్నప్పటికీ- దుర్భిక్షాన్ని ఎదు ర్కొనే వ్యూహాల రూపకల్పనలో దేశం ఇప్పటికీ ప్రాథమిక దశలోనే ఉంది. తీవ్రమైన దుర్భిక్షం సంభవించినప్పుడు స్థూల దేశీయోత్పత్తి రెండు శాతం, వ్యవసాయ ఉత్పత్తులు రెండు శాతం, సేద్య స్థూలోత్పత్తి మూడునుంచి 10శాతం కోసుకుపో తాయి. ఇది- విద్యుదుత్పత్తి, ఉపాధి కల్పన వంటి రంగాలను శరాఘాతమై తగులుతుంది. వెన్వెంటనే ద్రవ్యోల్బణం విజృంభిస్తుంది. ఈ నేపథ్యంలో కరవు నిర్వహణ విధానాలను సమీక్షించుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది. ముఖ్యంగా వివిధ శాస్త్ర సాంకేతిక సంస్థలు అందజేస్తున్న సమాచారాన్ని కరవు నిర్వహణ విధానాలతో ముడిపెట్టి ప్రత్యామ్నాయ వ్యూహాలకు పదును పెట్టాలి. ఎల్లవేళలా అక్కరకొచ్చే సమీకృత కరవు నివారణ నిర్వహణ ప్రణాళికను సిద్ధం చేసిపెట్టుకో వాలి. సంక్షోభాలను ఎదుర్కోవాల్సిన తీరుతెన్నుల గురించి రెండోపరిపాలన సంస్కరణల సంఘం ఇటీవల సమర్పించిన మూడో నివేదికలో వివిధ వ్యూహాలను చర్చించారు. దుర్భిక్ష ప్రాంతాల్లో స్థితిగతులను ఎప్పటికప్పుడు మదింపు చేయడం కోసం, కరవు నివారణ విధానాల రూపకల్పనకు నూతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా ఉపయోగించుకోవడం కోసం జాతీయ కరవు నిర్వహణ సంస్థను ఏర్పాటు చేయాలి. దేశంపై కరవు ప్రభావం ఏటేటా మారుతోంది. కొన్నిసార్లు కరవు జులై ఆరంభంలో, మరికొన్నిసార్లు విత్తులు వేసిన జులై-ఆగస్టు మధ్యకాలంలో సంభవిస్తుంటుంది. కరవు కొన్నిసం దర్భాల్లో ఆగస్టు మధ్యకాలంలో ప్రారంభమై సెప్టెంబరు చివరివరకూ కొనసాగుతుంటుంది. భిన్నకాలాల్లో ప్రారంభమయ్యే కరవు- వ్యవసాయంపై కనబరచే ప్రభావాలూ వైవిధ్యంగానే ఉంటాయి. కరవులపై, జాతీయ-ప్రాంతీయ స్థాయిల్లో అవి కనబరచే ప్రభావాలపై ఇప్పటికీ సంపూర్ణ పరిశోధన జరగలేదు.

## బహుముఖ వ్యూహం అవసరం

దేశంలో కరవు నివారణకోసం లెక్కలేనన్ని పథకాలను రూపొందించారు. కానీ వాస్తవంలో ఇవేవీ ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇవ్వలేదు. ప్రభుత్వ స్థాయిలో నియంత్రణ విభాగాలు పక్కాగా లేకపోవడం, మానవ వనరుల వైఫల్యం వంటి లోపాలవల్ల కరవు పథకాలు బాధితులకు సక్రమంగా చేరడం లేదు. దేశంలో వర్షపునీరు పెద్దయెత్తున సముద్రాల్లో కలిసిపోతుంది. సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి ఈ నీటిని సమర్థంగా వినియోగించుకునే ప్రయత్నాలు చేయ కుండా- స్వాతంత్ర్యానంతరం 63ఏళ్లయినా రుతుపవనాలపైనే పూర్తిగా ఆధారపడటం భారత్ వంటి దేశానికి మేలు చేసేది కాదు. కరవు సహాయ కార్యక్రమాల అమలులో జరుగుతున్న లోపాలకుగాను- ఒకదాన్ని మరొకటి విమర్శించుకో వడం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు పరిపాటిగా మారింది. దుర్భిక్షాన్ని ప్రభుత్వాలు సరైన కోణంలో అర్థం చేసుకోవాల్సి ఉంది. పరిస్థితి తీవ్రతను సరిగ్గా అంచనావేసి కరవు సహాయ కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన అమల్లో పెట్టాలి. దేశానికి ఆహారభద్రతను, దుర్భిక్ష పీడిత ప్రాంతాల రైతులకు రటను కలిగించడమే లక్ష్యంగా ప్రభుత్వం తన విధానాలను

సమీక్షించుకోవాలి. వర్షాభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై రైతుల్లో అవగాహనను పెంచడంకోసం ప్రయత్నించాలి. సబ్సిడీ ధరలకే విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడం కీలకం. రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలను మాఫీ చేయడంతోపాటు ప్రత్యామ్నాయ పంటల సాగుకు కొత్తగా రుణాలు ఇప్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలి. ప్రత్యామ్నాయ పంటలకు కావలసిన ఎరువులను అందుబాటులో ఉంచాలి. పంటలకు నిరంతరాయ విద్యుత్ సరఫరాపై సర్కార్లు ప్రత్యేక దృష్టిపెట్టాలి. పశుసంతతికి అవసరమైన నీటిని, మేతను అందుబాటులో ఉంచాలి. అందుకోసం పశువుల మేత కేంద్రాలను ఏర్పాటు చేయాలి. దుర్భిక్ష ప్రాంతాల రైతులకు మంచినీటిని అందించడం మరో కీలకాంశం. జాతీయ ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ పనులను చేపట్టాలి. కరవు పీడిత ప్రాంత రైతులకు అవసరమైన ఆహారాన్ని అందించాలి. విత్తనం వేసింది మొదలు ఉత్పత్తిని మార్కెట్‌కి తీసుకెళ్ళి విక్రయించేవరకూ తలెత్తుతున్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని కొత్త బీమా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలి. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలను అందించేందుకు పక్కా ఏర్పాట్లు చేయాలి. జాతీయ వర్షాధార ప్రాంత అథారిటీ(ఎన్.ఆర్.ఎ.ఎ.)ని క్రియాశీలం చేయడంతోపాటు 2008-'09 బడ్జెట్లో వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలకోసం కేటాయించి ఇప్పటివరకూ ఖర్చుచేయని రూ.348కోట్లను ఇకనైనా సమర్థంగా వినియోగించాలి. కరవు నివారణ కార్యక్రమాలపై ఎం.ఎస్.స్వామినాథన్ నేతృత్వంలోని జాతీయ రైతుల సంఘం సూచనలను సత్వరం అమలు పరిస్తేనే రైతుకు వెలుగు. కరవు నివారణ కార్యక్రమాలను రైతుల దగ్గరికి చేర్చే క్రమంలో పారదర్శకతకోసం స్థానిక స్వచ్ఛంద సంస్థలు, రైతు సంఘాల సహకారం తీసుకోవాలి. అన్నదాత దరికి ప్రభుత్వ పథకాలను చేరవేసే అధికారులను ఆయా కార్యక్రమాల్లోని అవకతవకలకు బాధ్యులను చేయాలి. కరవు దెబ్బకు విలవిలలాడుతున్న అన్నదాతకు అండగా నిలవాలన్న చిత్తశుద్ధి, నిబద్ధత అధికార యంత్రాంగంలో మొగ్గతొడగటం అన్నింటికన్నా ముఖ్యం. ఆత్మహత్యలకు పాల్పడకుండా రైతులను నిరోధించడం కోసం అవసరమైతే సర్కారు ఆదుకుంటుందన్న విశ్వాసాన్ని వారిలో నింపాలి.

(రచయిత భారతీయ రైతు సంఘాల సమాఖ్య- సి.ఐ.ఎఫ్.ఎ. సలహాదారు)